# నకిలీ మనిషి

సైదులు అవతారపురుషుడు.

కూటికోసం కాదుగాని కోట్లకోసం కోటి విద్యలు నేర్చుకున్నాడు. కొన్ని విద్యలు ప్రదర్శించి లక్షాధికారి అయ్యేడు. మరికొన్ని విద్యలు ప్రదర్శించి కోటీశ్వరుడు కావాలనే ఉబలాటంలో వున్నాడతను.

కాన్వెంటు స్కూలు ముందున్న చింతచెట్టు నీడలో నిలబడ్డాడు సైదులు. లంచ్ సమయంలో బయటకొస్తున్న పిల్లల మీద వుందతని దృష్టి. స్కూలు యూనిఫారంలో వొకేరకంగా కనబడుతున్న పిల్లల్లో తన కస్టమర్స్‌ని యిట్టే పసిగట్టేస్తాడతను.

ఖరీదైన కప్ ఐస్‌క్రీమ్స్, ఐస్‌బార్స్, చాక్‌లెట్స్ అమ్ముతాడతను.

ఒక్కసారి సైదులు అమ్మే చాక్‌లెట్‌గాని, ఐస్‌గ్రీమ్‌గాని రుచి చూసిన పిల్లలు మళ్లీ వాటిని ఒదిలి పెట్టరు.

అవి తిన్న తరువాత అంతా మత్తుగా గమ్మత్తుగా వుంటుంది. మాస్టరు తిట్టినా, కొట్టినా భయముండదు. హోమ్‌వర్క్ చెయ్యలేదనే దిగులే వుండదు. అమ్మ, నాన్న కొడతారనే భయం వుండదు.

గాల్లో తేలిపోతున్నట్లు, జెయింట్‌వీల్ ఎక్కినట్లు పసందుగా వుంటుంది.

అతను అమ్మే చాక్‌లెట్స్, ఐస్‌క్రీమ్‌ల ఖరీదు ఎక్కువ. ధనవంతుల పిల్లలు సైదులు ఉచ్చులో పడుతూ వుంటారు.

చింతచెట్టు క్రింద నిలబడ్డ సైదులను చూసి పరుగెత్తుకొచ్చాడు ప్రమోద్. అటుఇటు చూసి తననెవ్వరూ చూడటం లేదని నిర్ధారణ చేసుకున్నాక జేబులో నుంచి వంద రూపాయిల నోటు తీసి సైదులుకిచ్చాడు.

"దొంగతనం చేశావా?" ముసుముసి నవ్వులతో అడిగేదు ప్రమోద్‌ని.

ఆ కుర్రాడికి భయంతో చెమటలు పట్టాయి.

"నీకేం భయం లేదులే... నేను ఎవ్వరికి చెప్పనులే" ప్రమోద్ భుజం తట్టి నార్కోటిక్ చాక్‌లెట్స్ సైకిలుకు అమర్చిన డబ్బాలో నుంచి తీసి యిచ్చేదు.

ఆ చాక్‌లెట్స్ జేబులో కుక్కుకుని గార్డెన్‌వైపు పరుగెత్తాదు ప్రమోద్.

ఒక్కసారి మత్తుమందు కలిసిన చాక్‌లెట్స్, ఐస్‌క్రీములు తిన్నవాళ్లు మళ్ళీ వాటిని వదిలిపెట్టలేరు. చాక్‌లెట్స్, ఐస్‌క్రీములలో నార్కోటిక్ డ్రగ్స్ కలిపి అమ్ముతున్నారని నిఘా విభాగం తెలుసుకునే లోపే మరోచోట అవతారం ఎత్తుతాదు సైదులు.

లంచ్ సమయంలో అతని దగ్గర చాక్‌లెస్ట్ కొనుక్కుని చప్పరిస్తూ గార్డెన్‌లోని సిమెంటు బెంజీల మీదో. క్లాసురూముల్లోనో జోగుతూ పడుకుని సాయంత్రం యిళ్ళకు చేరుతారు పిల్లలు. మరుసటి రోజు కూడా అవే చాక్‌లెట్స్ తినాలనిపిస్తుంది. ఇంట్లో వాళ్లు డబ్బులివ్వకపోతే దొంగతనం చేస్తారు.

చేతికి అందిన వస్తువులు బజార్లో అమ్మేస్తారు.

ఐదోతరగతి చదివే పవన్ వొచ్చాదు.

నార్కోటిక్ చాక్‌లెట్స్ అంటే వాడికి తగనిపిచ్చి.

"స్పెషల్ చాక్‌లెట్స్ కావాలా?" ఊరిస్తూ అడిగేదు సైదులు.

మౌనంగా వుండిపోయేదు పవన్.

"డబ్బుల్లేవా?"

ఐదు నిముషాలు సైదులు పక్కనే నిలబడి, తటపటా యిస్తూ జేబులో నుంచి కాగితం పొట్లాం తీసి అతనికి యిచ్చేదు పవన్.

కాగితం పొట్లాం విప్పి చూశాదు సైదులు. నిగనిగ లాడే బంగారుగారు గొలుసు కన్పించేసరికి సైదులు కళ్లు మెరిసేయి.

ఐదు చాక్‌లెట్లు తీసి ఆ కుర్రాడి జేబులో కుక్కేదు.

ఆ చాక్‌లెట్స్ నోట్లో వుంటే చాలు-

లెఖ్ఖలు రాని మొద్దని టీచరు తిట్టినా ఏమీ అన్పించదు-

క్లాసురూములో నిద్రపోతున్నావని కొట్టినా ఫరవాలేదు-

గాలిలో తేలిపోతున్నట్లనిపించే అనుభూతే కావాలి వాడికి- పవన్ చాక్‌లెట్ చప్పరిస్తూ ప్లే గ్రౌండు చుట్టూ వున్న చెట్ల దగ్గరకు పరుగెత్తాడు.

పుస్తకాల షాపతను, స్కూల్లో పనిచేసే ఆయా తనకేసి అనుమానంగా చూడటం సైదులు గమనించేడు.

లంచ్ టైమ్‌లో రోజూ సైదులు రావడం, అతని దగ్గర చాక్‌లెట్స్, ఐస్‌క్రీములు కొనుక్కున్న పిల్లలు మత్తుగా పడుకోవడం ఆయా గమనించింది. తన మనస్సులోని అనుమానాన్ని పుస్తకాల షాపతనికి చెప్పింది.

ఎక్సరే కళ్లు సైదులివి. అక్కడ నుంచి వెంటనే బిచాణా ఎత్తివేయడం మంచిదనుకున్నాడు.

సైకిలు తొక్కుకుంటూ స్కూలు నుంచి తిరిగి వొస్తుంటే స్కూటరు మీద సుధాకర్, బాబూరావు కన్పించేరు సైదులుకి.

స్కూటరు ఆపి పలుకరించేడు సుధాకర్.

"బాస్ షోలాపూర్ నుంచి మందులు పంపించేడు" అన్నాడు మెల్లగా చుట్టుపక్కల వాళ్ళకి విన్పించని స్వరంతో.

"రాత్రి తొమ్మిదింటికి వొస్తాను... సరుకు తీసుకువెళతాను. ఎమౌంట్ కూడ రెడీగా వుంది" అన్నాడు సైదులు.

"దొంగనోట్లు తెచ్చేవు.... బాస్ తోలు వొలిచేస్తాడు" అన్నాడు సుధాకర్ నవ్వుతూ.

సుధాకర్ నకిలీ మందులు అమ్ముతాడు. నాసిరకం కల్తీ మందులు మందుల షాపులకు సైదులు ద్వారా సప్లయిచేస్తాడు. కల్తీమందులు ఎక్కువగా అమ్మడానికి సహాయపడ్డ మందులషాపులవాళ్లకి, డాక్టర్లకు 'పరసెంటేజి' వుంటుంది. స్కూటర్లు, సైకిళ్ళు, ఫ్రిజ్‌ల వంటి గిఫ్టులు కూడా వుంటాయి.

గ్లూకోజ్ పొడి నింపిన 'బి కాంప్లెక్స్' గొట్టాలు....

శాక్రిన్ కలిపిన రంగునీళ్ల టానిక్ బాటిల్స్....

డిస్టిల్డ్ వాటర్‌తో నింపిన ఇంజెక్షన్ సీసాలు...

ప్రాణాపాయస్థితిలో యివ్వవలసిన మందుల్లో కూడా కల్తీమందులు చోటు చేసుకున్నాయి.

బాబూరావు నకిలీ సర్టిఫికెట్స్ సృష్టించడంలో సిద్ధహస్తుడు. డాక్టరు డిగ్రీ, ఇంజినీరింగ్ డిగ్రీ వొకటేమిటి ఏ యూనివర్సిటీ డిగ్రీ కావాలన్నా క్షణాల్లో తయారుచేస్తాడు.

వాళ్ళు ముగ్గురూ బార్‌లోకి దూరేరు.

తలొక బాటిల్ బీరు తాగేరు.

వాళ్లు తాగింది కల్తీ బీరు అవడంతో నిషా ఎక్కలేదు.

బ్రాందీ, బటర్ చికెన్ తెప్పించుకున్నారు.

రాజకీయాలు, సినిమాల గూర్చి రెండు గంటలసేపు మాట్లాడుకున్నారు. బారులో వాళ్ళ వ్యాపారం గొడవలు ఎప్పుడూ మాట్లాడుకోరు.

నోరు నొప్పి పుట్టేదాకా మాట్లాడుకొని బార్‌లో నుంచి బయటపడ్డారు.

సుధాకర్, బాబూరావు స్కూటరు ఎక్కి వెళ్ళిపోయారు.

ఇంటికి తిరిగొచ్చేసేడు సైదులు.

ఇంటికి తాళం వేసి వుంది.

పక్కింటివాళ్ళని అడిగితే సైదులు భార్య కొడుక్కి వొంట్లో నలతగా వుందని హాస్పిటల్‌కు తీసుకువెళ్ళిందట.

వాళ్ళు చెప్పిన హాస్పిటల్‌కు పరుగెత్తాడు సైదులు.

హాస్పిటల్ ముందు జనం గుమిగూడి వున్నారు.

డాక్టర్ని పోలీసులు అరెస్టుచేసి తీసుకువెళ్తున్నారు.

గుంపులోకి దూరి విషయం ఏమిటని అడిగేడు సైదులు.

"ఆ డాక్టరు ఎక్కడి నుంచి వొచ్చాడో తెలియదుసార్! పెద్ద బోర్డు పెట్టి రెండేళ్ళ క్రితం హాస్పిటల్ పెట్టాడు. తక్కువ ఫీజు తీసుకుంటున్నాడని జనం కూడా ఇక్కడికే ఎక్కువమంది వస్తున్నారు...

ప్రాణపాయస్థితిలో వున్న పదిమంది రోగులకు ఏవో ఇంజెక్షన్స్ చేశాడట. ఆ

పదిమంది రోగులు చనిపోయారు. కాంపౌడరు భయపడి పోలీసులకు చెప్పడంతో అసలు విషయం బయటపడిందండి...

ఈ డాక్టరు నకిలీ డాక్టరట... పదో తరగతి తప్పి యమ్.బి.బి.యస్. దొంగ సర్టిఫికెట్ సంపాదించేడు... బోర్డు పెట్టేశాడు.... మన ప్రాణాలు తీయడానికి ఇక్కడ దాపరించేడు. ఈ నకిలీ డాక్టరు వాడే మందులు కూడ కల్తీ మందులు, నకిలీ మందులట!

అతనేదో చెప్పుకుపోతున్నాడు గాని సైదులు అతని చివరి మాటలు విన్పించుకోనట్లు నటిస్తూ హాస్పిటల్ లోపలికి వెళ్ళేడు.

సైదుల్ని చూడగానే బావురుమని ఏడుస్తూ అతని భార్య అతని చుట్టేసుకుపోయింది.

కల్తీ 'గ్లిసరల్ ఇంజెక్షన్' అతని కొడుకు ప్రాణాలు తోడేసింది.

వొంటినిండా చెమటలు పట్టాయి అతనికి.

ఛాతీలో నొప్పి మొదలయ్యింది.

ఒక్కగానొక్క కొడుకు.... ఎవరికోసమైతే తాను నానా గడ్డి కరుస్తూ, మోసాలు డబ్బు సంపాదిస్తున్నాడో ఆ కొడుక. దూరమయ్యాడు...

అతనిలో నుండి మరో మనిషి బయటకొచ్చి పగలబడి నవ్వాడు.

"ఇప్పుడు చెప్పు నేనెవ్వరిని?" అడిగేడు నకిలీ మనిషి. నకిలీ మనిషి అడిగిందే అడుగుతున్నాడు. అసలు మనిషి జవాబిచ్చే మనస్థితిలో లేదు.

– 'స్వాతి' వారపత్రిక, 1 సెప్టెంబర్ 1989